సాక్షి ఆదిలాబాద్

శనివారం । 11 । మార్చి । 2023



సందర్శించి.. తెలుసుకుని

ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారుల వారం రోజుల విలేజ్ విజిట్ ముగిసింది. గ్రామీణుల జీవన విధానం, వారి స్థితిగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 8లో▸



రేషన్‌కార్డుతో 'ఆయుష్మాన్'

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారు. ఇందుకోసం రేషన్ కార్డు ఈ-కేవైసీ తప్పనిసరి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. మధ్యాహ్నం ఉక్క పోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మహిళా ఉద్యోగులకు సన్మానం



సన్మానం పొందిన వారితో జిల్లా జడ్జి సునీత

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎంఆర్ సునీత హాజరై ఆయా శాఖల మహిళా ఉద్యోగులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రమీళజైన్, జడ్జీలు మంజుల సూర్యవార్, యశ్వంత్‌సింగ్ చౌహాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ యూత్ వలంటీర్స్ ఎంపిక దరఖాస్తు గడువు పొడిగించినట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి సుశీల్ పి.బడ్ ప్రకటనలో తెలిపారు. యువజన సంఘాల స్థాపన, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, క్రీడలు, ఆరోగ్యం, సామాజిక అంశాలపై యువతను చైతన్యపరిచే పలు కార్యక్రమాలపై 18 నుంచి 29 ఏళ్ల లోపు వారు నేషనల్ యూత్ వలంటీర్లుగా www. nyks. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాల కోసం 9404736673, 9381731381 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

12న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 12న జిల్లాస్థాయి మహిళల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పిట్ల రాజేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. పరుగు పందెంలో 200, 400, 800, 3000, 5000 మీటర్ల విభాగంలో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్ త్రో క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. 16ఏళ్లు పైబడిన బాలికలంతా అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు వయసు ధ్రువీకరణ, బోనఫైడ్, ఆధార్ కార్డ్ ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన వారు ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 94921 36510 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ప్రజలను మభ్యపెట్టేలా కేబినెట్ నిర్ణయాలు'



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేబినెట్ నిర్ణయాలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎన్నో హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయకుండా తాజాగా పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు అందజేస్తామని ప్రకటన చేయడం మరోసారి మోసపుచ్చేందుకే అని విమర్శించారు. నిరుద్యోగ భృతి అంశాన్ని ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. సమావేశంలో నాయకులు దినేష్ మటోలియా, బోయర్ విజయ్, లాలా మున్నా, కృష్ణయాదవ్ రఘుపతి, జీవన్, విఠల్, రవికృష్ణ పాల్గొన్నారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని మోటివేషన్ స్పీకర్ కె.రవీంద్ర ధీరజ్ జూమ్ ద్వారా అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులతో శుక్రవారం మాట్లాడారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై సుమారు మూడు గంటల పాటు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, సుజాత్ ఖాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోడు భూమి దరఖాస్తుకు సంబంధించి పరిశీలన చేస్తున్న అధికారులు (ఫైల్)

సంక్షేమంపై ఆశలు

- రాష్ట్ర కేబినెట్ నిర్ణయాల నేపథ్యంలో..
- గృహలక్ష్మితో ఇంటి నిర్మాణానికి సాయం
- ఇంకొంత మందికి 'దళితబంధు'
- ఇళ్ల క్రమబద్ధీకరణకు మరోసారి అవకాశం
- పోడు పట్టాలు, గొర్రెల పంపిణీకి సర్కారు సన్నద్ధం

ఇళ్ల క్రమబద్ధీకరణ..

జీవో 58 మొత్తం దరఖాస్తులు	801
కలెక్టర్ లాగిన్ వరకు వచ్చినవి	203 (పట్టాలు జారీ)
జీవో 59 మొత్తం దరఖాస్తులు	723
పురోగతిలో ఉన్నవి	123

గొర్రెల పంపిణీ..

మొదటి విడతలో గ్రౌండింగ్ యూనిట్లు	4,282
రెండో విడత యూనిట్ల సంఖ్య	4,337
గ్రౌండింగ్ అయిన యూనిట్లు	740
వచ్చిన డీడీల సంఖ్య	2,076
పంపిణీ చేయాల్సిన యూనిట్లు	3,597

గొర్రెల పంపిణీ..

గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రభుత్వం గొల్ల, కుర్మలకు మొదటి విడతలో యూనిట్లను మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేసింది. అనంతరం రెండో విడత ప్రారంభించినా అప్పట్లో కొంతమందికి మాత్రమే యూనిట్లు మంజూరు చేశారు. తర్వాత పంపిణీ నిలిచిపోయింది. తాజాగా ప్రభుత్వం ఏప్రిల్ నుంచి గొర్రెల యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఎంపిక చేసిన పలువురు లబ్ధిదారులు డీడీలు కట్టి యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారు.



తాజాగా ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో గ్రౌండింగ్ కావాల్సిన మిగతా యూనిట్లకు కూడా లబ్ధిదారుల నుంచి డీడీలు స్వీకరించేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పరిష్కారమైన పోడు పట్టాల (ఆర్‌వోఎఫ్ఆర్) దరఖాస్తులు, విస్తీర్ణం..

గిరిజనుల (ఎస్టీ) దరఖాస్తులు	14391
విస్తీర్ణం	58,536.55 ఎకరాలు
గిరిజనేతరుల దరఖాస్తులు	10,170
విస్తీర్ణం	39,355.95 ఎకరాలు
మొత్తం దరఖాస్తులు	24,561
మొత్తం విస్తీర్ణం	97,892.50 ఎకరాలు

సాక్షి, ఆదిలాబాద్: సంక్షేమ పథకాలపై జిల్లా ప్రజలు ముఖ్యంగా పేదలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తాజాగా రాష్ట్ర కేబినెట్ పాత, కొత్త పథకాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై వారిలో స్వాంతన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న గృహలక్ష్మి పథకంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పోడు భూములకు పట్టాల పంపిణీతో పాటు రెండో విడత గొర్రెల పంపిణీ, దళితబంధుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో చాలా మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే జీవో 58, 59 సంబంధించి కొత్త వాటికి ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో అనేక మంది దరఖాస్తుకు సిద్ధమవుతున్నారు.

గృహలక్ష్మిపై ఆశలు..

గృహలక్ష్మి అనే కొత్త పథకాన్ని కేబినెట్ సమావేశం అనంతరం ప్రభుత్వం ప్రకటించింది. నియోజకవర్గానికి 3వేల చొప్పున మంజూరు చేసింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ కోటా అదనం. ఇందులో భాగంగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.3లక్షల ఆర్థిక సాయం మహిళ పేరిట అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సాయం మూడు విడతల్లో అందనుంది. జిల్లాకు 7వేలకు పైబడి లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

పోడు పట్టాలు..

పోడు పట్టాల పంపిణీ విషయంలో అనేక మంది గిరిజనులు, గిరిజనేతరులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 17,657 దరఖాస్తులను పరిష్కరించి 69,654 ఎకరాలను పంపిణీ చేశారు. కొత్తగా గిరిజనులు, గిరిజనేతరుల నుంచి ఆర్‌వోఎఫ్ఆర్ కింద హక్కు పత్రాల జారీ కోసం దరఖాస్తులు తీసుకున్నారు. వాటికి సంబంధించి గ్రామ సభలు నిర్వహించి పరిశీలన కూడా చేశారు. తాజాగా ప్రభుత్వం వీటి విషయంలో పట్టాల పంపిణీకి సిద్ధమవుతుండటం ఆసక్తి కలిగిస్తుంది.

దళితబంధు ఇలా..

దళితబంధు కింద జిల్లాలో మొదటి విడతలో 249 మందికి ప్రయోజనం దక్కింది. ఈ పథకం కింద లబ్ధిదారుడికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందుతుంది. తద్వారా ఏదైనా యూనిట్ స్థాపించుకొని దళితుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. రెండో విడతలో నియోజకవర్గానికి 1100 మంది చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ లెక్కన జిల్లాకు సుమారు 3వేల మంది వరకు ఈ సంవత్సరంలో లబ్ధి చేకూరనుంది.

జీవో 58,59..

ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. 125 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి క్రమబద్ధీకరణకు జీవో 58, అంతకుమించి విస్తీర్ణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ విలువ ఆధారంగా క్రమబద్ధీకరించుకునేందుకు జీవో 59 ద్వారా అవకాశం కల్పిస్తుంది. ఇదివరకు 2014 సంవత్సరం కటాఫ్‌గా ఉండగా, ఆ తేదీని 2020కి మార్పు చేశారు. నెల రోజుల గడువుతో లబ్ధిదారులు ఆయా జీవోల కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

హౌసింగ్ రుణాలు గతంలోనే మాఫీ..

కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సంబంధించి గతంలోనే రుణాలు పూర్తిస్థాయిలో జిల్లాకు సంబంధించి మాఫీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డబుల్ బెడ్‌రూమ్ పథకం ప్రారంభించగా, జిల్లాలో ఇప్పటివరకు 3500 మంజూరు కాగా, అందులో 2200 గృహాలకు టెండర్ నిర్వహించారు.వాటి నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. మిగతా వాటి పనులు ప్రారంభం కాలేదు. అంచనా వ్యయం కారణంగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మిగతా ఇళ్ల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అర్బన్‌లో రూ.5.30 లక్షలు, రూరల్‌లో రూ.5.04 లక్షలకు డబుల్ బెడ్‌రూమ్‌కు వెచ్చిస్తుంది. అయితే ఇప్పటివరకు అధికారికంగా ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ప్రవేశం కూడా జరగకపోవడం గమనార్హం. తాజాగా ప్రభుత్వం గృహలక్ష్మి ద్వారా ఇళ్ల నిర్మాణానికి సాయం అందించేందుకు ముందుకు వచ్చింది.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలని ఆందోళన



జాతీయ రహదారిపై బైఠాయించిన గండ్రత్ సుజాత, ఇతర నాయకులు

జైనథ్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన వారికి అందించాలని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ సానుభూతి పరులు, నాయకులకే ఇళ్లు కేటాయించారని, భూములు, ఇళ్లు లేని నిరుపేదలను విస్మరించారని మండిపడ్డారు. వెంటనే అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాఘవేంద్రరావు అక్కడికి చేరుకున్నారు. పక్షపాతం లేకుండా అర్హులను మాత్రమే ఎంపిక చేశామని తెలిపారు. ఆందోళన విరమించాలని పోలీసులు సూచించగా.. అర్హులకు న్యాయం జరిగే వరకు ఆందోళన ఆపేదిలేదని వారు తేల్చిచెప్పారు. దీంతో పోలీసులు గండ్రత్ సుజాత, ఇతర నాయకులను అరెస్ట్ చేశారు. నాయకులు అశోక్ రెడ్డి, రూపేష్‌రెడ్డి, స్వామియాదవ్ పాల్గొన్నారు. ఆందోళనకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మహేందర్ మద్దతు పలికారు.

కలెక్టర్‌కు వినతి

కైలాస్‌నగర్: అనంతరం గండ్రత్ సుజాత పలువురు నాయకులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సమగ్ర సర్వే నివేదిక ఆధారంగా మళ్లీ గ్రామసభ నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

17న రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్

కైలాస్‌నగర్: అగ్రజా టౌన్‌షిప్‌లోని రాజీవ్ స్వగృహ ప్లాట్ల విక్రయానికి ఈ నెల 17న వేలం నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈమేరకు జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మావల మండలం బట్టి సావర్గాం శివారులోని లేఅవుట్‌లో గతేడాది ప్లాట్ల విక్రయాల కోసం వేలం నిర్వహించగా 58 ప్లాట్లకు బిడ్డర్లు డబ్బులు చెల్లించలేదన్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటికి మళ్లీ బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ పేరిట రూ.10వేల డీడీ తీసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లే అవుట్ లో మౌలిక సదుపాయాల కల్పన పనులు ఇప్పటికే ప్రారంభించామన్నారు. నీటి వసతి, విద్యుత్ స్తంభాలు, మురుగు కాలువలు తదితర పనులకు రూ.7కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, త్వరలో వాటికి మంజూరు ఉత్తర్వులు రానున్నాయన్నారు. అలాగే లే అవుట్ గుండా సర్వీస్ రోడ్డు కోసం జాతీయ రహదారుల అధికారులకు ప్రతిపాదనలు పంపించామని, ఆ పనులు ప్రారంభించేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ లే అవుట్ పక్కనే ఐటీ టవర్ నిర్మాణం జరుగనుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ప్లాట్లను సొంతం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మహేశ్వర్, ఆర్డీవో రాథోడ్ రమేశ్, గృహ నిర్మాణశాఖ నోడల్ అధికారి బసవేశ్వర్, టీఎస్ ఐఐసీ జూనియర్ ఇంజినీర్ రాజ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'వడ్డీ' మంజూరు

- నాలుగేళ్ల నిరీక్షణకు తెర
- మహిళా సంఘాల రెండేళ్ల రుణాల వడ్డీ క్లియర్
- జిల్లాకు రూ.4.71 కోట్లు విడుదల
- గ్రామ, సంఘాల వారీగా ప్రొసీడింగ్‌లు



సమావేశంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల మహిళల నాలుగేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణాలకు సంబంధించిన వడ్డీని మంజూరు చేసింది. 2018-19, 2019-20 సంవత్సరాలకు సంబంధించి జిల్లాకు రూ.4.71 బకాయిలు విడుదల చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయం మహిళల్లో ఆనందాన్ని నింపుతోంది.

నాలుగేళ్ల నిరీక్షణకు తెర

జిల్లావ్యాప్తంగా 17మండలాల పరిధిలో 7,532 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,16,492 మంది సభ్యులున్నారు. వీరు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేస్తుంది. వీటిని సకాలంలో వడ్డీతో పాటు చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని చెల్లిస్తోంది. అలా వచ్చిన సొమ్మును కలిపితే బ్యాంకులో ఉన్న రుణం తగ్గుతోంది. తద్వారా ఆయా సంఘాలపై వడ్డీ భారం పడకుండా ఉంటుంది. అయితే ఆరు నెలల కోసారి విడుదల చేయాల్సిన వడ్డీని ప్రభుత్వం నాలుగేళ్లుగా నిలిపివేసింది. దీంతో సకాలంలో రుణాలు చెల్లించిన ఆయా సంఘాల సభ్యులు వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణ ఫలించింది.

రూ.4.71 కోట్ల నిధుల విడుదల

మహిళల నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018-19, 2019-20 సంవత్సరాలకు సంబంధించిన వడ్డీని మంజూరు చేసింది. జిల్లాకు 2018-19 ఏడాదికి సంబంధించి 5902 సంఘాలకు గాను రూ.110.56 కోట్లు, 2019-20 సంవత్సరానికి సంబంధించి 6,543 సంఘాలకు గాను రూ.361.11కోట్లను విడుదల చేసింది. 2020-21, 2021-22 ఏళ్లకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది. వీటిని త్వరలోనే విడుదల చేస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిధులను సంబంధిత మహిళల ఖాతాల్లో జమ చేసేందుకు వీలుగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గ్రామ, స్వయం సహాయక సంఘాల వారీగా ప్రొసీడింగ్‌లను సిద్ధం చేసి ఆయా మండల సమాఖ్యలకు మెయిల్ ద్వారా పంపించారు. వాటి ప్రకారం ఆ నిధులు త్వరలోనే వారి ఖాతాల్లో జమ కానున్నాయి. పెండింగ్ బకాయిలు సైతం త్వరలోనే విడుదల చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఎదురుచూపులు తప్పాయి



మేము ప్రతి నెలా వడ్డీతో సహా రుణాలను చెల్లిస్తూ వస్తున్నాం. అయితే నాలుగేళ్లుగా ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీని మాత్రం విడుదల చేయడం లేదు. దీంతో తదుపరి రుణాలు పొందేందుకు తిప్పలైంది. ప్రభుత్వం ఆలస్యంగానైనా రెండేళ్లకు సంబంధించి వడ్డీ విడుదల చేయడంతో ఎదురుచూపులు తప్పాయి.

– జుగ్నాక్ ప్రమీల, మండల సమాఖ్య అధ్యక్షురాలు, తలమడుగు

మండలాల వారీగా మంజూరైన రుణాలకు సంబంధించిన వడ్డీ వివరాలు..

మండలం	2018-19 గ్రూపులు,	2018-19 మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)	2019-20 గ్రూపులు,	2019-20 మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
ఆదిలాబాద్‌రూరల్	365	8.18	375	24.93
బజార్‌హత్నూర్	350	4.98	387	15.39
బేల	392	6.16	415	22.19
భీంపూర్	300	4.7	343	13.18
బోథ్	578	12.29	597	41.37
గాదిగూడ	87	0.15	114	0.65
గుడిహత్నూర్	288	3.85	345	13.30
ఇచ్చోడ	469	7.83	533	30.69
ఇంద్రవెల్లి	269	1.97	319	6.38
జైనథ్	527	12.14	528	35.39
మావల	78	2.00	84	9.01
నార్నూర్	156	0.53	244	2.89
నేరడిగొండ	466	9.57	513	31.74
సిరికొండ	165	2.14	222	8.16
తలమడుగు	449	10.04	488	38.04
తాంసి	278	7.47	282	17.27
ఉట్నూర్	685	16.70	754	50.52

'సావిత్రీబాయి' సేవలు చిరస్మరణీయం

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే



సావిత్రీబాయి పూలే దంపతులకు నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా సావిత్రీబాయి పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సావిత్రీబాయి, జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రీ బాయి పూలే స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నర్సాగౌడ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సురేశ్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- డీఐఈవో రవీందర్‌కుమార్



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో రవీందర్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో సీఎస్, డీవోలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 30 మంది డిపార్ట్‌మెంటల్ (డీవో) అధికారులను నియమించినట్లు తెలిపారు. అలాగే కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు వివరించారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,297 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1095 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,791, ఒకేషనల్ విద్యార్థులు 1002 మంది హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. అలాంటి పరిస్థితి ఉంటే విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి కూడా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు. ఇబ్బందులు ఉంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శనగ కుప్ప దగ్ధం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో భగ్నూరే లక్ష్మణ్‌రావు అనే కౌలు రైతుకు చెందిన శనగ కుప్ప శుక్రవారం రాత్రి కాలిబుడిదైన సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. నాలుగు రోజుల కిందట పంట కోసి నూర్పిడి కోసం కుప్పగా పెట్టాడు. శుక్రవారం రాత్రి ఆకస్మాతుగా శనగ కుప్పకు నిప్పు అంటుకుని కాలిబూడిదైనట్లు తెలిపారు. దాదాపుగా రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సంఘటనా స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ వెళ్లి పంచనామా నిర్వహించారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


ప్రియాంక మృతదేహం

కుభీర్: కడుపు నొప్పి భరించలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నిగ్వా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ వివరాల ప్రకారం... గాడేకర్ ప్రియాంక (22) నాలుగేళ్ల క్రితం విఠల్‌తో వివాహమైంది. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో గురువారం రాత్రి 2గంటల ప్రాంతంలో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా ఏజెన్సీలో చోరీ


ఆధారాలు పరిశీలిస్తున్న క్లూస్ టీం

భైంసాటౌన్: పట్టణంలోని వినాయక్‌నగర్‌లోని జువెల్లరీ మార్కెట్ సమీపంలోని రవి కిరాణ ఏజెన్సీ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఉదయం కాంప్లెక్స్‌లోని ఇతర దుకాణదారులు షెట్టర్ పగులగొట్టి ఉండడం గమనించి దుకాణ యజమానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీను చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. నూనె డబ్బాలు, కంప్యూటర్ మానిటర్ చోరీకి గురైనట్లు బాధితుడు రవి తెలిపారు.

శ్రీనివాస్ ఆచూకీ లభ్యం

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన బొంతల శ్రీనివాస్ దుబాయ్‌లో కనబడకుండా పోయిన విషయం తెలిసిందే. అతడు దుబాయ్‌లోని భారత ఎంబసీలో సురక్షితంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. తమతో ఫోన్లో మాట్లాడినట్లు చెప్పారు. అయితే సదరు కంపెనీ వారు మార్చి 4వ తేదీ రాత్రి 2గంటలకు దుబాయ్ ఎయిర్‌పోర్టులో అతడిని కలుసుకోవాల్సి ఉండగా సదరు కంపెనీ వారు రిసీవ్ చేసుకోలేదు. దీంతో అతడు భారత ఎంబాసీని సంప్రదించాడు. ఆర్మూర్‌కు చెందిన ఏజెంట్ ద్వారా శ్రీనివాస్ వెళ్లాడని కుటుంబీకులు పేర్కొన్నారు. 5వ తేదీ ఆదివారం కావడంతో కంపెనీ ఏజెంటు శ్రీనివాస్‌ను రిసీవ్ చేసుకోలేదని ఆర్మూర్ ఏజెంట్ తెలిపాడని, కంపెనీతో మాట్లాడుతున్నామని ఏజెంటు పేర్కొన్నట్లు కుటుంబీలు తెలిపారు.

సందర్శించి.. తెలుసుకుని


పార్‌పెల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

గ్రౌండ్ రిపోర్ట్

● ముగిసిన ట్రైనీ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన ● వసతులపై ప్రత్యక్ష పరిశీలన ● 'సాక్షి'తో వారి మనోగతం..

లక్ష్మణచాంద: వారంతా ట్రైనీ అధికారులు.. వీరిలో ఒకరు ట్రైనీ ఐఈఎస్ కాగా, నలుగురు ట్రైనీ ఐఎస్ఎస్ ఆఫీసర్లు. ఈ నెల 4వ తేదీ నుంచి నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద, ఖానాపూర్, కడెం మండలాలను సందర్శించారు. ఇందులో ఐదుగురు లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామానికి వచ్చారు. శిక్షణలో భాగంగా వీరు ఆరురోజులుగా గ్రామంలోనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రధాన వృత్తులు, సాగు చేస్తున్న పంటలు, సాగునీటి వసతి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శుక్రవారం పర్యటన ముగించుకున్నారు. ఈ సందర్భంగా వారిని 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు పంచుకున్నారు.

అవకాశం వస్తే తెలంగాణలో పని చేసేందుకు సిద్ధం



మాది ఉత్తరప్రదేశ్. తండ్రి సంత్‌కుమార్ సింగ్, తల్లి సావిత్రీదేవి. మాది మధ్యతరగతి కుటుంబం. తండ్రి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ నన్ను చదివించారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. తండ్రి పడుతున్న కష్టం నేరుగా చూసి ఎలాగైనా మంచి ఉద్యోగం సాధించాలనే తపనతోనే ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. అదే పట్టుదలతో చదివి 2020లో ఐఎస్ఎస్ 15 ర్యాంక్‌తో సాధించాను. నేడు ఐఎస్ఎస్ ట్రెనింగ్ కోసం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ పథకాలు, ప్రజల మంచి తనం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. నాకు తెలంగాణలో అవకాశం వస్తే తప్పకుడా పని చేస్తా.

– రాహుల్ సింగ్, ట్రైనీ ఐఎస్ఎస్ అధికారి

లక్ష్యం ముందే నిర్ణయించుకోవాలి



మాది ఢిల్లీ. తండ్రి రాజేంద్రకుమార్, తల్లి ఇంద్ర. తండ్రి చిన్న ప్రైవేట్ ఉద్యోగి, తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి ఇష్టంతో చదివేదాన్ని. పాఠశాల స్థాయి నుంచి పీజీ స్థాయి వరకూ మొత్తం ఫ్రీగానే చదివాను. ఎంఏ ఎకనామిక్స్ ఢిల్లీలో చేశాను. సరైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు. పీజీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు మొదటి సారి గ్రూపు పరీక్ష రాశాను కానీ రాలేదు. రెండో సారి పట్టుదలతో చదివి 2023 ఐఈఎస్‌లో 16వ ర్యాంక్ సాధించాను. – షెఫాలీ, ట్రైనీ అధికారి

అన్ని రంగాల్లో అభివృద్ధి



కడెం: శిక్షణలో భాగంగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ పర్యటించాం. ఈ గ్రామంలో పరిశుభ్రత, ఇంకుడుగుంతల నిర్మాణాలు, పాఠశాల, బ్యాంక్ సేవలందించేందుకు కస్టమర్ సర్వీస్ పాయింట్, చక్కని పరిపాలన అందించే పాలకవర్గం ఉంది. వ్యవసాయ ఆధారిత గ్రామంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

– ఆలీషాఖానం, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

పథకాల అమలు తీరు

ప్రజాసంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్తున్నాయా? లేదా? అనే అంశాల గురించి తెలుసుకునేందుకు నేరుగా ప్రజలతో మాట్లాడారు. పథకాల ఫలాలు అర్హులకు అందుతున్న తీరును ప్రజల ద్వారా తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు గల మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామానికి గల రోడ్డు సౌకర్యం, గ్రామంలోని ఓపెన్ జిమ్, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, డంప్‌యార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో సాగు చేస్తున్న పంటల వివరాలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు.


పార్‌పెల్లిలో ట్రైనీ అధికారులు

పట్టుదలతో చదివి సాధించా



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. తండ్రి వాసుదేవ్ సింగ్, తల్లి నీలమ్ సింగ్. తండ్రి ఓ ప్రైవేట్ ఉద్యోగి. చిన్నతనం నుంచి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చేశాను. పట్టుదలతో చదివి చివరకు 2022 లో ఐఎస్ఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించాను. ఇక్కడ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు సరైన లక్ష్యంతో ముందుకుసాగడం లేదు. పదో తరగతిలోనే లక్ష్యం నిర్ధారించుకునేలా కేరిర్ గైడెన్స్ ఏర్పాటు చేయాలి. – వీణాసింగ్, ట్రైనీ అధికారి

పల్లెవాతావరణం నచ్చింది



మాది ఉత్తరఖండ్ రాష్ట్రం. మా తండ్రి జీవన్ చంద్రజోషి, తల్లి లీలాజోషి. మా తండ్రి ప్రైవేట్ ఉద్యోగి. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. మాది మధ్య తరగతి కుటుంబం. కష్టాలు దాటుకుంటూ లక్ష్యం కోసం చదివి చివరకు 2020లో ఐఎస్ఎస్ ఐదో ర్యాంక్ సాధించాను. ఇక్కడి పల్లె వాతావరణం చాలా నచ్చింది. పాఠశాలలో సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ విద్యతో పాటు, ఆంగ్లంపై పట్టు సాధించేలా చర్యలు చేపడితే ఉపయోగం.

– భావనాజోషి, ట్రైనీ అధికారి

కష్టాలను జయించి..



మాది ఢిల్లీ. మా తండ్రి బాబులాల్ మీన్, తల్లి రామ్‌పతి మీనన్. తండ్రి ప్రైవేట్ ఉద్యోగి కావడంతో తమ చదువుల కోసం అతడు అనేక కష్టాలు పడ్డారు. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పీజీ చేశాను. కష్టాలను అధిగమించి చదువులపై దృష్టి సారించి 2021లో 45వ ర్యాంక్ సాధించాను. సాధించాలనే తపన ఉంటే కష్టాలు అడ్డుకావు.

– గోవర్ధన్ మీనన్, ట్రైనీ అధికారి

నీటి విలువ గురించి తెలియజేశాం



కడెం: నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఆరురోజుల పాటు పర్యటించాం. గ్రామంలో అన్ని వసతులు బాగున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం నల్లా నీటిని అందించడం బాగుంది. కానీ.. చాలా వరకు ఇళ్లలో నల్లాలు బిగించనందున నీరు వృథాగా పోతోంది. గ్రామస్తులు నీటి వృథాను అరికట్టాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి

– సందీపన్ సర్కార్, ఇండియాన్ స్టాటిస్టికల్ సర్వీస్

గ్రామీణ జీవన విధానం బాగుంది



ఖానాపూర్: మండలంలోని మారుమూల గ్రామమైన ఎర్వచింతల్ ప్రజల జీవన విధానం బాగుంది. అత్యధిక మంది ఈ గ్రామంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ఈ ప్రాంతం ఎగువభాగం కావడంతో బ్యాక్‌వాటర్‌లో ఎంతో మంది చేపలు పట్టి జీవనాన్ని సాగిస్తున్నారు. చేపలు విక్రయించేందుకు వీరికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తే వీరి జీవనం మరింత సాఫీగా ఉంటుంది.

– శిఖ, ట్రైనీ అధికారిణి

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాం



ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు ఆరురోజులపాటు శిక్షణ తీసుకున్నాం. ఇక్కడ స్థానిక అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి వసతి కల్పించారు. గ్రామంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఈ శిక్షణ నివేదికను కలెక్టర్‌తోపాటు శిక్షణ కేంద్రంలో అందజేస్తాం. గ్రామస్తుల ప్రేమ, ఆప్యాయతలు మరువలేనివి.

– ఛాయా, ట్రైనీ అధికారిణి

రేషన్‌కార్డుతో 'ఆయుష్మాన్ భారత్'

● ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా వైద్యం
● గ్రామాల్లో కొనసాగుతున్న ప్రక్రియ
● ఈ నెల 31 వరకు ఈ-కేవైసీకి అవకాశం

ఆదిలాబాద్ జిల్లాలో..

రేషన్‌కార్డులు	: 1,91,902
ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు	: 66,302


ఆయుష్మాన్ కార్డును నమోదు చేస్తున్న సీఎస్సీ ఆపరేటర్

బోథ్: రాష్ట్రంలో ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ పథకం కింద రేషన్ కార్డు ఉన్నవారు ఉచితంగా వైద్యం చేయించుకునేవారు. రూ.2లక్షలలోపు వైద్యాన్ని అందించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణలో కూడా అమలు చేయడంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రూ.5లక్షల వరకు దేశంలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ఆయుష్మాన్ భారత్–ఆరోగ్యశ్రీగా పిలుస్తున్నారు. ఈ కార్డు పొందాలంటే రేషన్‌కార్డు ఉన్న వారు ఈ-కేవైసీ చేయించుకోవాలి. గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించారు. సీఎస్సీ(కామన్ సర్వీస్ సెంటర్)లో కొత్త రేషన్ కార్డుకు ఆధార్ నంబరును అనుసంధానిస్తారు. ఏప్రిల్ నుంచి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తారు. జనవరి నుంచి ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను సీఎస్సీ సెంటర్ల ఆపరేటర్లు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లోకి వెళ్లి ఈ-కేవైసీ చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా కేవైసీకి అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా ఎక్కడైనా వైద్య సేవలు..

ఆరోగ్యశ్రీ కార్డుతో కేవలం రాష్ట్రంలోనే వైద్య సేవలు చేయించుకునే అవకాశం ఉండేది. అది కూడా రూ.2లక్షలలోపు వైద్యానికే సరిపోతుంది. ఆయుష్మాన్ భారత్ కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా రూ.5లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశం ఏర్పడింది. ఈ కార్డుతో 1886 రకాల వ్యాధులకు చికిత్స చేయించుకోవచ్చు. ముఖ్యంగా కిడ్నీ, గుండె మార్పిడి, కాలేయ వ్యాధులు, మోకాలి చిప్ప మార్పిడితో పాటు అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,91,902 రేషన్ కార్డులు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు 66 వేలు ఈ-కేవైసీ ద్వారా ఆయుష్మాన్ కార్డులను నమోదు చేసుకున్నారు. కాగా ఈ నెల 31వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది.

ఈ కేంద్రాల్లో నమోదుకు అవకాశం...

ఆయుష్మాన్ భారత్ కార్డులు నమోదు చేసుకోవడానికి రాష్ట్రంలో ఎక్కడినుండైనా చేసుకోవచ్చు. సీఎస్సీ కేంద్రాలు(కామన్ సర్వీస్ సెంటర్లు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య మిత్ర లేదా ఏఎన్ఎంలు నమోదు చేస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను వారికి చెబితే ఆయుష్మాన్ భారత్‌ను నమోదు చేస్తారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కోసం నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

31లోగా నమోదు చేసుకోవాలి



ప్రభుత్వం నుంచి వచ్చిన అర్హుల జాబితా ఆధారంగా సీఎస్సీ ఆపరేటర్లు గ్రామాల్లోకి వెళ్లి ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ పథకంలో తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. ఈ నెల 31వ తేదీలోగా ఆయా గ్రామాల్లోని సీఎస్సీ సెంటర్ల వద్ద నమోదు చేసుకోవాలి. ఇందుకు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నంబరు వివరాలు ఇవ్వాలి. కేంద్రాల నిర్వాహకులు ఈ-కేవైసీ చేస్తారు. ఏప్రిల్ నుంచి కార్డులను అందజేస్తాం.

– రాహుల్, సీఎస్సీ జిల్లా మేనేజర్, ఆదిలాబాద్

నర్సాపూర్‌లో సామూహిక వివాహాలు


వధూవరులతో బలిరాం జాదవ్

ఇచ్చోడ: ఒకే వేదికపై సామూహికంగా వివాహాలు జరిపించే సంప్రదాయం గొప్పదని తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలిరాం జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్‌లో నాలుగు జంటలకు సామూహిక వివాహాలు చేశారు. ఈ సందర్భంగా బలిరాం జాదవ్ నూతన వధూవరులను ఆశీర్వదించి మాట్లాడారు. 30ఏళ్లుగా ఈ సామూహిక వివాహాలు చేస్తూ గ్రామస్తులు జిల్లా ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

కిడ్నాప్ కేసులో ఆరుగురు యువకుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని వర్ధా జిల్లా సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఇటీవల కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఆ యువకుడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన ఆరుగురు యువకులు మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఓ యువకుడిని సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత ఆ యువకుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చేసి రూ.2లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో సదరు యువకుడి తల్లిదండ్రులు వీరిలో ఒకరి బ్యాంక్ ఖాతాలో రూ.20వేలు జమ చేశారు. ఈ విషయమై మహారాష్ట్రలోని వర్ధా జిల్లా అల్లిపూర్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ ఖాతా ఆధారంగా మహారాష్ట్ర పోలీసులు నిందితుల వివరాలను కనుగొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చేరుకొని కిడ్నాపర్ల వివరాలను సేకరించారు. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఆరుగురు యువకులను అరెస్టు చేసి మహారాష్ట్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు వీరిని ఆదిలాబాద్‌రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్సైకు సమాచారం అందించారు. అనంతరం మహారాష్ట్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా స్థానిక యువకులు ఎవరిని కిడ్నాప్ చేశారు.. ఎందుకు కిడ్నాప్ చేశారనే వివరాలను రూరల్ పోలీసులను అడగగా తమకు సమాచారం తెలియదని, వారిని అరెస్టు చేసి తీసుకెళ్లే ముందు పోలీసుస్టేషన్‌కు వచ్చి సమాచారం అందించారని వివరించారు.

దృష్టి మరల్చడానికే కొత్త నాటకం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి


మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: ఈడీ కేసు నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఎమ్మెల్సీ కవిత మహిళా రిజర్వేషన్ బిల్లుపై దేశ రాజధానిలో దీక్ష పేరిట కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ స్కాం విషయంలో ఈడీ నోటీసులు ఇవ్వగానే ఎమ్మెల్సీ కవితకు మహిళా రిజర్వేషన్ బిల్లు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు సరైన సముచిత స్థానం సైతం ఇవ్వడం లేదని మండిపడ్డారు. క్యాబినెట్ సమావేశంలో మంత్రులు రిజర్వేషన్ బిల్లు దీక్షలో కూర్చోవాలని ఆదేశాలు ఇవ్వడం దేనికి సంకేతం అన్నారు. సమావేశంలో నాయకులు విజయ్ గండేవార్, కాంత, రాము, ముఖీమ్, అనూప్, రవి ఉన్నారు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో ఫారెస్టు అధికారులు

బోథ్: మండలంలోని నాగాపూర్ గ్రామంలో రూ. 27,666 విలువ గల కలపను పట్టుకున్నట్లు బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు. శుక్రవారం తమకున్న సమాచారం మేరకు నేరడిగొండ రేంజ్ అధికారి గణేష్‌తో సంయుక్తంగా ఆపరేషన్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలపను బోథ్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఓలు సుందర్, ధన్‌సింగ్,ఎఫ్‌బిఓ రాకేష్, విశ్వజిత్, రాజేందర్, గంగమల్లులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


పరశురాం మృతదేహం

సారంగపూర్: మద్యం మత్తులో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఆదివాసీగూడలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... దేశ్ముడే పరశురాం(30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే సమయంలో తన ఇంటికి మద్యం సేవించి వచ్చిన పరశురాంను భార్య విమల మందలించింది. ఈ క్రమంలో ఇంటినుంచి బయటకు వెళ్లి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. తిరిగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా మృతిచెందాడు. పరశురాంకు భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

సజీవ దహనం కేసులో బెయిల్ పిటిషన్ కొట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గుడిపెల్లిలో గత డిసెంబర్ 16న జరిగిన సజీవదహనం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌ను ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ ఘటనలో మేడి లక్ష్మణ్, శనిగారపు సృజన, శ్రీరాముల రమేష్, వేల్పుల సమ్మయ్య, అర్నకొండ అంజయ్యలపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపర్చడం, రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. వీరిలో ఏ-1 లక్ష్మణ్, ఏ-3 శ్రీరాముల రమేష్, ఏ-4 వేల్పుల సమ్మయ్యలను డిసెంబర్ 23న పోలీసులు వారం రోజుల పోలీసు కస్టడీకి కోరగా ఆరు రోజులు 25నుంచి 30వరకు అనుమతి ఇచ్చారు. కాగా, శుక్రవారం నిందితుల తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.